
సాక్షి గుంటూరు

మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



జలపాలేశ్వరుడికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడులోని జలపాలేశ్వరస్వామికి ఫాల్గుణ బహుళ సప్తమి సోమవారాన్ని పురస్కరించుకొని విశేష పూజలు చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 513.40 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహరి (బుధ)
గుంటూరు	6.26	4.44
నరసరావుపేట	6.28	4.47
బాపట్ల	6.26	4.44

న్యూస్‌రీల్

శిక్షణకు అధికారులు హాజరు తప్పనిసరి




నరసరావుపేట: పోలింగ్ పర్సనల్స్ ఎన్నికల శిక్షణా కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ విషయమై సంబంధిత రిటర్నింగ్ అధికారులు పోలింగ్ పర్సనల్స్‌కి తెలియజేయాలన్నారు. ఎన్నికల శిక్షణకు సంబంధించిన ట్రైనింగ్ ఆర్డర్స్ పోలింగ్ పర్సనల్స్ అందరికీ రావడం జరుగుతుందని, పోలింగ్ పర్సనల్స్ అందరూ పోస్టల్ బ్యాలెట్ కోసం అవసరమైన ఫామ్ -12ని పూర్తిచేసి శిక్షణకు వచ్చేసమయంలో తీసుకొని రావాలని వారికి ఆర్‌ఓలు స్పష్టంగా సూచించాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు సజావుగా జరుగుతున్నాయా అనేది ఆర్‌ఓలు పరిశీలన చేయాలన్నారు. డీఆర్వో కె.వినాయకం, జిల్లా అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

5వ తేదీ వరకు ఏపీఆర్‌జేసీ సెట్ గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలోని పాఠశాలలు, కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రవేశానికై ఆన్‌లైన్ దరఖాస్తుకు గత నెల 31న ముగిసిన గడువును ఈనెల 5వ తేదీ వరకు పొడిగించినట్లు సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల్లో 5వ తరగతితోపాటు 6,7,8 తరగతుల్లో మిగిలిన ఖాళీల భర్తీకై ఏపీఆర్ఎస్ క్యాట్-2024, జూనియర్ ఇంటర్, డిగ్రీలో ప్రవేశానికి నిర్వహించనున్న ఏపీఆర్‌జేసీడీసీ సెట్-2024కు ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్. ఇన్ సైట్ ద్వారా ఈనెల 5వ తేదీలోపు దరఖాస్తు చేయాలని సూచించారు.

గజేంద్ర మోక్షంలో నారసింహుడు



మంగళగిరి: స్థానిక శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి గజేంద్ర మోక్షం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవానికి ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి పర్యవేక్షించగా ఉత్సవ కైంకర్యపరులుగా శేషగిరిరావు, కల్యాణి వ్యవహరించగా ఆస్థాన కైంకర్యపరులుగా తాడికొండ తిరుమలరావు, తాడికొండ సాయికుమార్ వ్యవహరించారు.

పోలీసు తనిఖీల్లో రూ.12 లక్షలు స్వాధీనం

చిలకలూరిపేటటౌన్: ఎన్నికల తనిఖీల్లో భాగంగా సోమవారం మండలంలోని బొప్పూడి గ్రామ చెక్‌పోస్టులో ఎటువంటి ఆధారాలు లేని రూ.12 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ జి.రవికృష్ణ తెలిపిన వివరాలు.. ప్రకాశం జిల్లా చర్లపల్లి గ్రామానికి చెందిన తాళ్లూరి తిమోతి కారులో గుంటూరు వైపు వెళుతున్న క్రమంలో సోదా చేయగా ఎటువంటి ఆధారాలు లేని నగదు పట్టుబడిందని చెప్పారు. ఈ నగదును స్వాధీనం చేసుకొని, ఇన్‌కమ్ టాక్స్ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

యార్డులో 1,21,030 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,21,030 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,14,869 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 19,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 79,882 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

వృద్ధులపై కక్ష కట్టినట్లుంది



గత నెల వరకు వృద్ధులు, వికలాంగులు, రోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన వేకువజామున ఇంటికి వచ్చి వలంటీర్ పింఛన్ ఇచ్చేవాడు. చంద్రబాబు కుటిల బుద్ధితో వలంటీర్లను టార్గెట్‌గా చేసి ఫిర్యాదు చేసిన కారణంగా మాకు ఇంత వరకు పింఛన్ అందలేదు. వృద్ధులు, వికలాంగులపై కక్ష తీర్చుకుంటున్న చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతాం. సీఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని గెలిపించుకుంటాం.

– నూతక్కి వీరయ్య, తుళ్లూరు, పెన్షన్‌దారు

వృద్ధులకు మళ్లీ కష్టాలు



నాలుగున్నర ఏళ్లుగా పింఛన్ ఇంటికి వచ్చి ఇస్తున్నారు. ఎటువంటి ఇబ్బందులు లేవు. వలంటీరు పొద్దున్నే ఇంటికి వచ్చి డబ్బులు ఇచ్చేవాడు. ఇప్పుడు పంచాయతీ ఆఫీసుకు వెళ్లి తెచ్చుకోవాలని చెబుతున్నారు. అక్కడకు వెళ్లాలంటే ముసలి వాళ్లం ఇబ్బంది పడతాం. ఈ రోజు డబ్బులు ఇవ్వలేదు. మరి ఎప్పుడు ఇస్తారో తెలియదు. వైఎస్ జగన్‌బాబును ఇబ్బంది పెడుతున్నారు. ఆయనకు మంచి జరుగుతుంది.

– వల్లూరి జన్నిమ్మ, వృద్ధాప్య పింఛన్‌దారు, కొలకలూరు

ఆఫీసుకు వెళ్లడం ఇబ్బందే..



ప్రతి నెల ఒకటో తారీఖు వలంటీరు ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవాడు. ఈ నెలలో రాలేదు. అడిగితే పంచాయతీ ఆఫీసులో ఇస్తారని చెప్పారు. అక్కడకు వెళ్లి తెచ్చుకోవాలంటే కష్టంగా ఉంటుంది. అక్కడ ఎక్కువ మంది ఉంటారు. ఇబ్బందిగా ఉంటుంది. జగన్‌ను మళ్లీ గెలిపిస్తే ఇంటికి వచ్చి పింఛన్ వలంటీరు ఇస్తాడు. మా లాంటి వారికి ఇబ్బందులు తప్పుతాయి.

– షేక్ ముంతాజ్, వితంతు పింఛనుదారు, కొలకలూరు

పేదల పెన్షన్లపై పెత్తందారుల విషం

పండుటాకులు....జీవితంలో చిందించిన చెమట చుక్కలకు సాక్షులు.... ఎత్తుపల్లాలను చూసిన ఎవరెస్టులు....అటుపోట్లను అనుభవించిన వృద్ధ కెరటాలు...అలసిసొలసి బతుకు తీరం చేరిన నావికులు.. జవసత్వాలు ఉడికి వాలుతున్న పొద్దులు.. జీవిత చరమాంకంలోనూ ఆత్మాభిమానం చంపుకోలేని సగటు జీవులు.. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో డొక్కలు మాడిన బడుగులు.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే పింఛన్ భరోసాతో కుదుటపడిన ప్రాణులు.. ప్రతి నెలా మొదటి తేదీనే గుమ్మం వద్ద అందుకున్న పింఛన్ సొమ్ముతో నాలుగేళ్లు నోటిలోకి తీసుకుని ఆనంద పడిన అవ్వతాతలు.. నేడు కోర్టు రూపంలో 'పెత్తందారులు' కక్కిన విషపు చుక్కలకు విలవిల్లాడుతున్న 'పేదలు'...!



ఈ ఫొటోలో కనిపిస్తున్న దివ్యాంగురాలి పేరు సయ్యద్ నసీమా. తెనాలి పట్టణంలోని చెంచుపేట. తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈమె పుట్టుకతోనే పోలియో బాధితురాలు. తండ్రి లేడు. తల్లి, సోదరుడు ఉన్నారు. తల్లి వృద్ధురాలు. సోదరుడు బైక్ మెకానిక్‌గా పనిచేసుకుని జీవిస్తున్నాడు. రెండు కాళ్లు, చేతులు పని చేయవు. సొంత పనులు చేసుకోవడం కూడా కష్టమే. ఆమెకు కుటుంబ సభ్యులే ఆధారం. పదేళ్ల నుంచి పింఛన్ తీసుకుంటోంది. గతంలో పింఛన్ కోసం పంపిణీ కేంద్రానికి వెళ్లేందుకు అనేక ఇబ్బందులు పడింది. సమయానికి పింఛన్ వచ్చేదికాదు. మళ్లీ మళ్లీ తిరగాల్సి వచ్చేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే వలంటీర్ వ్యవస్థను తీసుకురావడంతో ఆమెకు ఇబ్బందులు లేకుండా పోయాయి. వేకువజామునే తలుపుతట్టి పింఛన్ అందిస్తుండడంతో ఐదేళ్లగా దిగులు లేకుండా పోయింది.' గతంలో మాదిరి మళ్లీ పింఛన్ కోసం గ్రామ సచివాలయానికి వెళ్లాల్సి ఉందని తెలియడంతో నసీమా ఆందోళన చెందుతోంది. వేసవిలో అక్కడ వరకు తీసుకెళ్లడం తల్లిదండ్రులకు భారమవుతోందని చెబుతోంది.

- టీడీపీ కుట్రతోనే ఆగిన పింఛన్ల పంపిణీ
- గ్రామ సచివాలయానికి ఎలా వెళ్లాలి అంటూ వృద్ధుల నిట్టూర్పు
- ఇప్పటి వరకు ఒకటో తేదీనే అందించిన వలంటీర్లు
- ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లపై కుట్రలు పన్నుతున్నారని లబ్ధిదారుల ఆవేదన

సాక్షి ప్రతినిధి, గుంటూరు: పండుటాకులకు పెద్ద కష్టం వచ్చిపడింది. తెలుగుదేశం, జనసేన కుట్రలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెల సూర్యుడు ఉదయించకమునుపే ఇంటి తలుపు తట్టి చిరునవ్వుతో అవ్వాతాతలను పలకరించి పింఛన్ డబ్బులను వారి చేతిలో పెట్టేవారు వలంటీర్లు. ఈ వ్యవస్థ గత 55 నెలలుగా నడుస్తూనే ఉంది. తమకు జగన్‌మోహన్‌రెడ్డే ఈ డబ్బులు ఇస్తున్నాడని ప్రతి అవ్వాతాతకు తెలుసు. అయినా వారికి పింఛన్ వలంటీర్లతో పంపిణీ కాకుండా చేసేందుకు చంద్రబాబునాయుడు కుట్రకు తెరలేపారు. తనకు కావాల్సిన రిటైర్డు ఐఏఎస్ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌తో కలసి వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఫిర్యాదులు చేయించారు. ఎన్నికల సంఘం ఈ మేరకు వలంటీర్లను పింఛన్లు, ఇతర సంక్షేమ కార్యక్రమాలు ఇళ్లకు వెళ్లి ఇవ్వకుండా ఆదేశాలు జారీ చేసింది. వలంటీరు వ్యవస్థపై మొదటి నుంచి తెలుగుదేశం, జనసేన తప్పుడు ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే. వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు ఇంటికే అందడం, ఆ వ్యవస్థకు గుర్తింపు రావడాన్ని వీరు తట్టుకోలేకపోయారు. తమ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో వృద్ధులను, వికలాంగులను తీవ్ర ఇబ్బందుల పాలు చేశారు. ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడంతోనే గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం, వలంటీర్ వ్యవస్థను తీసుకురావడం జరిగింది. కరోనా సమయంలో కూడా వలంటీర్లు ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందించారు. వరదలు వచ్చినా, ఏ కష్టం వచ్చినా 50 ఇళ్లకు ఒక వలంటీరు ఉండే ఈ వ్యవస్థ అండగా నిలబడింది. దీంతో కన్నుకుట్టిన చంద్రబాబునాయుడు కుట్రకు తెరలేపి నిమ్మగడ్డ ద్వారా ఈ ఫిర్యాదులు చేయించారు. ఈ నిర్ణయంతో ప్రతి నెల ఒకటోతేదీన ఇంటికి వెళ్లి పింఛన్ ఇచ్చే కార్యక్రమానికి గండి పడింది.

జిల్లాలో లబ్ధిదారులు ఇలా..

గుంటూరు జిల్లాలో మొత్తం 2,62,517 మందికి పింఛన్ వస్తోంది. వీరి కోసం నెలకు సుమారు రూ.77.50 కోట్లు ఖర్చు చేస్తోంది. 1,28,682 మందికి వృద్ధాప్య పింఛన్లు, 64,231 మందికి వితంతు పింఛన్లు, 24,937 మందికి దివ్యాంగ పింఛన్లు, 4143 మంది చేనేత కళాకారులకు, 896 మంది డప్పు కళాకారులకు, 487 మంది డయాలసిస్ రోగులకు, 1208 మంది దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారికి ప్రభుత్వం పింఛన్లు ఇస్తోంది. ఇప్పుడు ఎన్నికల సంఘం నిర్ణయంతో వృద్ధులు, వికలాంగులకు ఇంటికి పింఛన్ వెళ్లే అవకాశం లేకుండా పోయింది. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పింఛన్ ఇచ్చే అవకాశం లేకపోవడంతో ప్రతి సచివాలయం వద్ద పింఛన్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. గ్రామ సచివాలయాల వద్ద పింఛన్‌దారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని, తాగునీటి సదుపాయంతో పాటు ఇతర సదుపాయాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మీడియాకు తెలిపారు. తమకు పింఛన్ రాకుండా తెలుగుదేశం, జనసేన అడ్డుకోవడంతో వృద్ధులు, వికలాంగులు ఆందోళన చెందుతున్నారు. ప్రచారం కోసం వెళ్లిన తమను అవ్వాతాతలు ప్రతి చోటా నిలదీస్తున్నారని, తెలుగు తమ్ముళ్లు సోషల్‌మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సేవ చేస్తున్న తమపై అసత్య ఆరోపణలు చేయడమే కాకుండా తమను వృద్ధులకు సేవలు అందించకుండా అడ్డుకుంటున్న వైఖరిని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా వలంటీర్లు రాజీనామాలు చేస్తున్నారు.



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

పింఛన్లు ఇళ్ల వద్ద ఇవ్వాలి



నాకు చిన్న వయస్సులో అనారోగ్యానికి గురయ్యాను. అప్పుడు వాడిన మందుల వలన నడవలేని స్థితిలోకి ఉన్నా. కిడ్నీలు కూడా దెబ్బతిన్నాయి. అప్పటి నుంచి డయాలసిస్ చేయించుకుంటూ వస్తున్నా. చిన్న అనారోగ్య సమస్య వచ్చిన ఆస్పత్రికి వెళ్లి చూపించుకోవాల్సి ఉంది. నాలాంటి వారికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.10వేలు పింఛన్ ఇస్తోంది. వలంటీర వ్యవస్థ తీసుకొచ్చి ఇంటి వద్దకే పింఛన్ నగదు అందజేస్తున్నారు. మళ్లీ ఎన్నికల కమిషన్ నిబంధనలతో గతంలో మాదిరి సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోవాలని చెబుతున్నారు. నాలాంటి రోగులకు ఇది ఎంతో కష్టం. వెంటనే ఎలక్షన్ కమిషన్ స్పందించి పింఛన్లను లబ్దిదారుల ఇళ్ల వద్దకే వచ్చి పంపిణీ చేసేలా చూడాలి.

– సాల్మన్‌రాజు, డయాలసిస్ పెన్షన్ లబ్దిదారుడు, తెనాలి

మళ్లీ ఎదురు చూపులే



నాకు 80 సంవత్సరాలు. పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం చేయడంతో ఒకటో తేదీ ఇవ్వాల్సిన పింఛన్ ఇవ్వలేదు. గ్రామ సచివాలయానికి వెళ్లి తెచ్చుకోవాలని చెబుతున్నారు. మళ్లీ టీడీపీ హయాంలో ఇబ్బందులు వచ్చినట్లు కనిపిస్తున్నాయి. డబ్బులు మెడిషన్, సొంత ఖర్చులకు ఎంతగానో ఉపయోగపడేవి. ప్రస్తుతం ఇద్దరు అండతో రుబయట అరుగుపై కూర్చొంటున్నా. తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో నేను పింఛన్ కోసం ఎక్కడికి వెళ్లగలను. నాలాంటి వాళ్లను ఇబ్బంది పెట్టడానికే ఇలాంటి నిబంధనలు పెడుతున్నారా.

–తాళ్లూరి సాంబయ్య, 44వ డివిజన్, కొరిటెపాడు

వృద్ధాప్యంలో ఇబ్బందులు



నా వయస్సు 80 సంవత్సరాలు. వలంటీర్లు ప్రతినెలా క్రమం తప్పకుండా ఒకటో తేదీన ఇంటికి వచ్చి పింఛను ఇస్తున్నారు. ఈ వయస్సులో సచివాలయం వద్దకు వెళ్లి పింఛన్ తెచ్చుకోవాలంటే ఎంతో ఇబ్బంది. టీడీపీ ఉద్దేశపూర్వకంగా వలంటీర్లను విధుల నుంచి తప్పించేలా చర్యలకు పాల్పడడం సరికాదు. రాజకీయంగా ఎటువంటి కార్యక్రమాలు చేపట్టవచ్చు కానీ, ప్రజలను ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తున్న తీరు సరి కాదు. కుల, మతాలు, రాజకీయ పార్టీలు వంటి బేధాలు లేకుండా వలంటీర్లు చేస్తున్న సేవలు అభినందనీయం. అటువంటి వలంటీర్లను ఇబ్బంది పెట్టడటమంటే పరోక్షంగా ప్రజలను ఇబ్బందులు పెట్టడమే.

– గాదె ఆదిరెడ్డి, పాతగుంటూరు, మారుతీనగర్

వృద్ధుల మోముల్లో చిరునవ్వే లక్ష్యం



మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని. హాజరైన సీనియర్ సిటిజన్లు

- అవ్వా, తాతలు అవస్థలు పడకూడదనే జగనన్న వలంటీర్ల వ్యవస్థ తెచ్చారు
- ప్రతినెలా ఇంటి వద్దకే పింఛన్ పంపుతున్న ప్రభుత్వం మాది
- రాష్ట్ర సీనియర్ సిటిజన్ల సమావేశంలో మంత్రి విడదల రజిని

పట్నంబజారు (గుంటూరు తూర్పు): అవ్వా తాతల చల్లని దీవెనలతో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టి నాటి నుంచి వారికి అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ.. వారి మోముల్లో చిరునవ్వు చూడాలనేదే లక్ష్యంగా పనిచేస్తున్నారని మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని చెప్పారు. అరండల్‌పేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో సోమవారం రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి రజిని మాట్లాడారు.

చంద్రబాబు హయాంలో ఎన్నో అవస్థలు

గతంలో వృద్ధాప్య పింఛను కోసం వృద్ధులు గంటలు తరబడి క్యూ లైన్లలో నిలబడి, పడిగాపులు కాయాల్సి వచ్చేదని, వారు ఆ అవస్థలు పడకూడదనే ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగనన్న వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి ఇంటి వద్దకే తీసుకువెళ్లి పింఛను డబ్బులు అందజేస్తున్నారని చెప్పారు. అలాగే మంచం మీద కదల్లేని నిస్సహాయ స్థితిలో ఉండే వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కోసం ఫ్యామిలీ డాక్టరు విధానాన్ని ప్రవేశపెట్టారని, ప్రతినెలా ఆయా పీహెచ్‌సీల పరిధిలో డాక్టరు వారి ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య చికిత్సలు అందజేసి, అవసరమైన మందులు ఇస్తున్నారన్నారు. సాధారణంగా వయసు పెరిగే కొద్ది అనారోగ్య సమస్యలు వస్తుంటాయని, వీరందరికీ తరుచూ వైద్య సేవలు, మందులు అవసరమవుతాయని చెప్పారు. ఇలాంటి వారి కోసం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఊరూరా తీసుకొచ్చిన గొప్ప ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని తెలిపారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో వైద్య సేవలు పొందిన 50 శాతానికిపైగా రోగులు 60 ఏళ్ల పైబడిన వారేనని తెలిపారు. వీరందరికీ ఉచితంగా వైద్యం, మందులు అందజేస్తున్నామని చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంచిన ఘనత కూడా తమదేనన్నారు.

మంత్రి రజినికి అండగా నిలుస్తాం

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి విడదల రజినికి అండగా నిలుస్తామని, ఆమె విజయానికి తమవంతు సహకారం అందిస్తామని సీనియర్ సిటిజన్ల నాయకులు,పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు హామీ ఇచ్చారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉంటామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గెలుపు కోసం తమవంతు కృషి చేస్తామని వెల్లడించారు. విడదల రజిని మద్దతుగా పని చేస్తామన్నారు. సమావేశంలో ఏపీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చాగంటి పరమేశ్వరరెడ్డి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు యూవీవీఆర్ సాగర్, ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి ప్రభుదాసు, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, కోటా ప్రసాద్, గౌరవ అతిథులు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, తాడేపల్లి విజయకృష్ణ పాల్గొన్నారు.

'కోడ్' అమలుకు పటిష్ట చర్యలు

- ఇప్పటి వరకు రూ.1.69 కోట్లు స్వాధీనం
- పెన్షన్ల పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- జిల్లావ్యాప్తంగా 1884 పోలింగ్ కేంద్రాలు
- కొత్తగా 31 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఎన్నికల కోడ్ అమలుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌లో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలసి విలేకరుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 16న ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో రాజకీయ పార్టీలతో వారం, వారం సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఎప్పటికప్పుడు వివరిస్తున్నట్లు చెప్పారు. కొత్త ఓటర్లను చేర్చుకునే అవకాశం ఇంకా ఉందని తెలిపారు. పోలింగ్‌కు పది రోజుల ముందు వరకూ వచ్చిన వాటిని పరిశీలించి ఓటు హక్కు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని వివరించారు.

పోలింగ్ కేంద్రాలపై దృష్టి

జిల్లా వ్యాప్తంగా 1884 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, 1,500 ఓటర్లు దాటిన చోట కొత్తగా అగ్జలరీ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉండడంతో ఇప్పటికే 31 కొత్త పోలింగ్ కేంద్రాల కోసం ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 17,82,488 మంది ఓటర్లు ఉండగా అందులో మహిళా ఓటర్లు 9,21,333 మంది, పురుష ఓటర్లు 8,60,998 మంది 1,777 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 23 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు, 63 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 63 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, 17 వీడియో కవరేజ్ బృందాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 176 మంది సెక్టార్ ఆఫీసర్లను ఏర్పాటు చేశామని వారు ఆయా రూట్లను పర్యవేక్షిస్తున్నారని, జిల్లాలో అత్యంత సమస్యాత్మక బూత్‌లు లేవని, క్రిటికల్‌గా ఉన్న చోట్ల జిల్లా ఎస్పీతో మాట్లాడి తగిన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి ఇంకా ఫిర్యాదులు వస్తున్నాయని, పత్రికల్లో వచ్చిన వార్తలను కూడా పరిశీలించి చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

పలువురిపై చర్యలు

జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన 124 మంది వలంటీర్లను తొలగించగా, నలుగురు కాంట్రాక్టు సిబ్బంది, ఒక రెగ్యులర్ ఉద్యోగిపై చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఇప్పటి వరకు కోటి 69 లక్షల రూపాయల విలువైన నగదు, బంగారం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆరు లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నామని, జిల్లా వ్యాప్తంగా 13 అంతర్‌జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తనిఖీలలో పట్టుబడిన డబ్బు, బంగారానికి సంబంధించి కలెక్టరేట్‌లో ఉన్న గ్రీవెన్స్ రిడ్రెసెల్ కమిటీకి దరఖాస్తు చేసుకుని, వాటికి సంబంధించిన ఆధారాలు చూపిస్తే వెనక్కి ఇచ్చేస్తామని తెలిపారు. హాస్పిటల్, వ్యాపార అవసరాలు, పెళ్లిళ్ల కోసం డబ్బులు తీసుకువెళ్తున్న వారు కూడా ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

వినతుల పరిశీలనకు...

ఎన్నికల సమాచారానికి సంబంధించి వస్తున్న వినతులను సింగిల్ విండో పద్ధతిలో 24 నుంచి 48 గంటల్లోగా పరిష్కరిస్తున్నామని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. ఇప్పటి వరకు 485 వినతులు రాగా 317 పరిష్కరించగా, 107 తిరస్కరించడం, 39 ప్రాసెస్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. మైక్, ఆడియో, వీడియో ప్రచారాలకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కరపత్రాలను కూడా కూడా ఎంసీఎంసీ కమిటీలో పరిశీలించి అనుమతులు ఇస్తున్నామని చెప్పారు.

ఆడియో, వీడియో ద్వారా ఫిర్యాదు చేయవచ్చు..

సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదులు ఆడియో, విడియో పద్ధతిలో కూడా పంపవచ్చని కలెక్టర్ తెలిపారు. వీటికి వచ్చిన ఫిర్యాదులను వంద నిముషాల్లో పరిష్కరిస్తామన్నారు. ఇప్పటి వరకు 161 ఫిర్యాదులు రాగా 107 ఫిర్యాదులను సకాలంలో, మరో ఏడు ఫిర్యాదులను 100 నిముషాలు దాటిన తర్వాత పరిష్కరించామని, మిగిలిన ఫిర్యాదులు తమకు సంబంధం లేనివి వచ్చాయన్నారు.

పింఛన్ల పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..

పింఛన్ల పంపిణీకి సంబంధించి వలంటీర్లతో పంపిణీ చేయవద్దని ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. వీటిని ఆయా సచివాలయాల వద్ద పంపిణీ చేసేందుకు, వృద్ధులు ఇబ్బంది పడకుండా తాగునీరు ఇతర ఏర్పాట్లు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కోసం కూడా ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలలో ఓటింగ్ శాతం రాష్ట్ర స్థాయి ఓటింగ్ శాతం కన్నా తక్కువ నమోదు అవుతున్న నేపథ్యంలో ఓటింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. స్వీప్ ద్వారా పలు కార్యక్రమాలు చేపట్టడం, 18 సంవత్సరాల దాటిన వారిని ఎన్‌రోల్‌మెంట్ చేసేందుకు చర్యలు చేపట్టామని వివరించారు.

వసంత నవరాత్రులకు ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి వసంత నవరాత్రోత్సవాలకు ముస్తాబవుతోంది. 9వ తేదీ నుంచి 10రోజుల పాటు నిర్వహించే వసంత నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఉత్సవాలలో భాగంగా 10 రోజుల పాటు అమ్మవారికి రోజుకో విశేషమైన సుగంధ పరిమళాలు వెదజల్లే పుష్పాలతో అర్చన నిర్వహిస్తారు. తెలుగు వారి సంవత్సరాది ఉగాది పర్వదినం, వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభం నేపథ్యంలో ఉత్సవ ఏర్పాట్లను మరింత కట్టుదిట్టంగా చేయాలని ఆలయ ఈవో అధికారులను ఆదేశించారు.

విశేషపుష్పార్చన ఇలా..

9వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రత్యేక పుష్పార్చన ప్రారంభం కానుంది. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి ప్రాంగణంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం విశేష పుష్పార్చన చేస్తారు.

క్లుప్తంగా

ఆస్తి పన్ను వసూళ్లలో జీఎంసీకి తృతీయస్థానం

ఆదివారం ఒక్కనాడే రూ.5.09 కోట్ల వసూలు

నెహ్రూనగర్: 2024 ఆస్తి పన్ను వసూళ్లల్లో గుంటూరు నగరపాలక సంస్థ రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిందని, చివరి రోజైన ఆదివారం ఒక్కరోజే రూ.5.09 కోట్లు వసూళ్లు చేసి ద్వితీయ స్థానంలో నిలిచిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీని నగర ప్రజలు విరివిగా సద్వినియోగం చేసుకున్నారని, పన్ను వసూళ్ళలో రాష్ట్రస్థాయిలో విశాఖపట్నం, విజయవాడ తర్వాత 3వ స్థానంలో గుంటూరు నగరపాలక సంస్థ నిలిచిందని తెలిపారు. సుమారు రూ.20 కోట్ల అన్ కలెక్టబుల్ డిమాండ్‌తో కలిపి మొత్తంగా ఉన్న రూ.143.46 కోట్ల ప్రైవేట్ డిమాండ్ గాను మార్చి 31 నాటికి రూ.98.25 కోట్లు వసూళ్లు చేయడం జరిగిందన్నారు. మార్చి 31 (ఆదివారం) ఒక్కరోజు రూ.5.09 కోట్లు వసూళ్లు చేయడం ద్వారా రాష్ట్రస్థాయిలో ఒక్కరోజులో అధిక కలెక్షన్ చేసి ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. నగరంలో ప్రభుత్వ, ప్రైవేట్ అసెస్మెంట్‌ల నుంచి సుమారు రూ.280.86 కోట్లు డిమాండ్ ఉండగా ఏప్రిల్1, 2023 నుంచి మార్చి 31, 2024 నాటికి అందులో 114.68 కోట్లు వసూళ్లు జరిగిందని పేర్కొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు

గుంటూరు ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అవసరమైన ఉపకరణాలు అందించేందుకు నిర్ధారణ పరీక్షలు మంగళవారం నుంచి ప్రత్యేక శిబిరాల్లో నిర్వహిస్తున్నట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 2న తెనాలి బాలాజీరావుపేట భవిత కేంద్రం, 3న పెదనందిపాడులోని భవిత కేంద్రంతో పాటు ఈనెల 4వ, 6వ తేదీల్లో గుంటూరు బ్రాడీపేట 2వ లైనులోని శారదానికేతన్ ప్రాంగణంలో ఉన్న సమగ్రశిక్ష జిల్లా సహిత విద్యా వనరుల కేంద్రంలో జరుగుతాయని వివరించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పిల్లలను ఆయా శిబిరాలకు తీసుకువచ్చి, ఉపకరణాలను ఉచితంగా పొందే అవకాశాన్నివినియోగించుకోవాలని సూచించారు.

తూర్పులో రెండు వాహనాలు జప్తు

గుంటూరు వెస్ట్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్ తూర్పు నియోజకవర్గంలో తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో రూ.15 లక్షలు విలువ చేసే స్కార్పియో వాహనంతోపాటు, రూ. 28 లక్షలు ఫజీరో వాహనాన్ని సీజ్ చేశామని కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. దీంతోపాటు ఇప్పటి వరకు సీజ్ నగదు, మద్యం, వాహనాలు, ఇతర వస్తువుల విలువ రూ.1.72 కోట్లు అని తెలిపారు.

సమస్యాత్మక గ్రామాలపై నిఘా

- డీఐజీ జి. పాలరాజు ఆదేశం
- నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి
- రౌడీషీటర్ల కదలికలపై కన్నేసి ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ పాలరాజు

బాపట్ల టౌన్: పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని డీఐజీ జి. పాలరాజు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన సార్వత్రిక ఎన్నికలపై పోలీస్ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. తొలుత ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, నమోదు చేసిన కేసులు, సీజ్ చేసిన నగదు, అక్రమ మద్యం, చెక్‌పోస్ట్‌ల వద్ద నిర్వహిస్తున్న వాహన తనిఖీలపై ఆరా తీశారు. అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా సమర్థంగా ఎన్నికల విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తూ, ప్రజలంతా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా వారిలో భరోసా కల్పించాలని చెప్పారు. జిల్లాలోని సమస్యాత్మక గ్రామాల్ని పోలీస్ అధికారులు తరచూ సందర్శించాలని ఆదేశించారు. గ్రామాల్లో చెడునడత కలిగిన వ్యక్తులు, గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించి వారిపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. వారి కార్యకలాపాల్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ శాంతిభద్రతకులకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నేర చరిత ఉన్న వ్యక్తులను ముందుగానే బైండోవర్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న అరెస్ట్ వారెంట్‌లను వెంటనే ఎగ్జిక్యూట్ చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ముద్దాయిలను వెంటనే అరెస్ట్ చేయాలని తెలిపారు. చెక్‌పోస్ట్‌ల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అక్రమంగా రవాణా జరిగే నగదు, మద్యం, ప్రజలను ప్రలోభాలకు గురి చేయడానికి ఉపయోగించే బహుమతులు, వస్తువులను కట్టడి చేయాలని చెప్పారు. ప్రతిరోజు ఫ్లాగ్‌మార్చ్‌లు, ఫుట్ పెట్రోలింగ్, వాహన తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. జిల్లాలో ఎక్కడైనా శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే వెంటనే ఆ ప్రదేశానికి చేరుకునే విధంగా పోలీస్ అధికారులు, సిబ్బంది సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో ఎస్పీ వకుల్‌జిందాల్, అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, బాపట్ల డీఎస్పీ సీహెచ్. మురళీకృష్ణ, చీరాల డీఎస్పీ బి.ప్రసాద్, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, ఏఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్, ఎస్‌బీ సీఐ వి.మల్లికార్జున, డీసీఆర్‌బీ సీఐ పి.మురళీకృష్ణ, ఎలక్షన్ సెల్ సీఐలు ఏ.శ్రీనివాసరెడ్డి, సీహెచ్.సింగయ్య, ఐటీ కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

రైలు పట్టాలపై పరుగులు తీసిన సరుకు రవాణా

- 3.364 మిలియన్ టన్నుల సరుకు ఎగుమతి
- చరిత్ర తిరగరాసిన గుంటూరు రైల్వే డివిజన్
- డీఆర్ఎం రామకృష్ణ




వ్యాగన్లలోకి సరుకు లోడ్ చేస్తున్న చిత్రం

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు అత్యధికంగా 3.364 మిలియన్ టన్నుల మేర సరుకు రవాణా చేసినట్లు గుంటూరు డీఆర్ఎం రామకృష్ణ వెల్లడించారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు రైల్వే డివిజన్ 2023–24 ఆర్థిక సంవత్సరాన్ని గుంటూరు ప్రసిద్ధ రెడ్ చిల్లీస్‌తో ముగిస్తోందన్నారు. 2 దశాబ్దాల గుంటూరు రైల్వే డివిజన్ చరిత్ర నేడు తిరగరాసిందన్నారు. రికార్డులు బద్దలు కావడానికి ఉద్దేశించినవి అనే సామెత ప్రకారం మార్చి 2024 నెల కొత్త రికార్డులను బద్దలు కొట్టడంలో గుంటూరు రైల్వే డివిజన్ పోటీ పడిందన్నారు. మునుపటి ఏడాదితో పోల్చితే లోడింగ్‌లో ఎన్నడూ లేని విధంగా అత్యధిక పెరుగుదల దక్షిణ మధ్య రైల్వే విభాగాలలో చూసిన వృద్ధి శాతం గుంటూరు డివిజన్‌లో అత్యధికమన్నారు. డివిజన్ ఏర్పడిన్పటి నుంచి రూ.398.5 కోట్ల మొత్తంతో 2023–24 ఏడాదిలో సరుకు రవాణా ఆదాయం రెండవ అత్యధిక ఆదాయం అని చెప్పారు. 4.1 లక్షల టన్నులతో గుంటూరు డివిజన్ ఏర్పడిన్పటి నుంచి 2024 మార్చిలో ఒకే నెలలో అత్యధికంగా సరుకు రవాణా జరిగిందన్నారు. మార్చి 2024లో ఒకే నెలలో ఆర్జించిన అత్యధిక రాబడి రూ.47.09 కోట్లు అని తెలిపారు. డివిజన్‌లో సరుకు రవాణా చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్క విభాగాధిపతి నుంచి క్రింది స్థాయి రైల్వే ఉద్యోగిని డీఆర్ఎం అభినందించారు. డివిజన్ దక్షిణ మధ్య రైల్వే విభాగాలలోనే రికార్డు స్థాయిలో సరుకు రవాణా జరగడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఇదే తరహాలో డివిజన్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిందిగా కోరారు.

చంద్రబాబుకు దళితులు గుణపాఠం చెబుతారు

- శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థిపై చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలకు ఖండన
- ప్రత్తిపాడులో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

ప్రత్తిపాడు: దళితులను తూలనాడుతున్న చంద్రబాబు నాయుడుకు త్వరలోనే గుణపాఠం చెబుతామని ఆర్ అండ్ బీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పిల్లి మేరీ హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఇటీవల శింగనమల వైఎస్సార్ సీపీ దళిత ఎమ్మెల్యే అభ్యర్థిపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని అంబేద్కర్ విగ్రహం ఎదుట వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. విలేకరుల సమావేశంలో మేరి మాట్లాడుతూ టిప్పర్ డ్రైవర్ అని, వేలిముద్ర.. అని కించపరచడం దారుణమన్నారు. పద్నాలుగేళ్లు సీఎంగా చేసి ప్రజలకు ఏం చేశాడో చెప్పుకోలేక ఇలా దళితులపై పడి చంద్రబాబు ఏడుస్తున్నాడని మండిపడ్డారు. దళితులను పురుగుల్లాగా, అంటరాని వారిలాగా మాట్లాడటం చంద్రబాబుకు అలవాటైందని, కానీ తమ ఓట్లు మాత్రం కావాలా అంటూ మేరి సూటిగా ప్రశ్నించారు. జగన్‌మోహన్ రెడ్డి పెత్తందార్లుకు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధంలో మనమంతా పేదలకు అండగా నిలవాలన్నారు. వైఎస్సార్ టీయూసీ జిల్లా కన్వీనర్ ఆవుల సుందర్‌రెడ్డి మాట్లాడుతూ దళితులను కించపరిచేలా మాట్లాడిన చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో దళిత సమాజం తగిన రీతిలో బుద్ధి చెప్పాలని కోరారు. సేవాదళ్ విభాగం జిల్లా కన్వీనర్ ఉద్దగిరి మురళి మాట్లాడుతూ చంద్రబాబు వ్యవస్థలను, వ్యక్తులను, కులాలను కించపరచడమే ఆనవాయితీగా పెట్టుకున్నారని విమర్శించారు. ఆయన పెత్తందారీ వ్యవస్థకు ఆద్యుడిగా ఉన్నారన్నారు. వాడపల్లి ఫ్రాన్సిస్ చంద్రబాబుకు మతిభ్రమించి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఉడుతూరి ఓంప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ఎన్ఆర్ఐలు, డబ్బు సంచులు ఉన్నవారికి, తన సామాజిక వర్గం వారికి టిక్కెట్లు ఇచ్చుకుంటూ పరిపాలన చేస్తూ నీతి మాటలు చెప్పడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో వాడపల్లి ఫ్రాన్సిస్ అనిల్, దాసరి చెంచు రామారావు, కవిత, రవీంద్రరెడ్డి, బాపతు వెంకటేశ్వరరెడ్డి, గుజ్జుల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో ఆర్టీసీ కానిస్టేబుల్ ?

వినుకొండ(నూజెండ్ల): ఎన్నికల కమిషన్ ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనవద్దంటూ ఆదేశించినప్పటికీ కొంతమంది ఉద్యోగులు పార్టీ కార్యకర్తల్లాగా నాయకుల వెంబడి పాల్గొంటున్నారు. వినుకొండ ఆర్టీసీ డిపో గ్యారేజీలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాపర్ల అనిల్ తెలుగుదేశం పార్టీ ప్రచార కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు బహిరంగంగానే ర్యాలీలో తిరుగుతున్నాడు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కుమారుడు గోనుగుంట్ల హరీష్ నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో సైతం పాల్గొన్నారు. దీనిపై ఎన్నికల అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొడుకును హతమార్చిన తండ్రి

పాతగుంటూరులోని క్రిస్టియన్‌పేటలో ఘటన


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌ఓ రమేష్ బాబు

పట్నంబజారు: తండ్రి, కొడుకుల మధ్య వివాదం హత్యకు దారి తీసింది. పోలీసుల కథనం ప్రకారం పాతగుంటూరులోని క్రిస్టియన్‌పేటలో నివాసం ఉండే తవనం మోజెస్‌కుమార్ (29) ఆదివారం అర్ధరాత్రి తండ్రి చేతిలో హత్యకు గురయ్యాడు. తండ్రి కవిరాజు ప్లంబర్‌గా పనిచేస్తుంటాడు. తల్లి శారదా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయాగా పనిచేస్తోంది. నెల రోజులుగా ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని తండ్రి కవిరాజు, మోజెస్ కుమార్‌లు ఉపవాసాలు ఉంటున్నారు. ఈనేపథ్యంలో గతంలోనే తండ్రి, కొడుకుల మధ్య స్వల్ప వివాదాలు జరుగుతుండేవి. మోజెస్‌కు వివాహం కాకపోవడంతో నిత్యం తండ్రితో వివాహ విషయమై వాదన పడుతుండేవాడు. ఈక్రమంలో ఆదివారం తండ్రి ద్విచక్రవాహనం మోజెస్ కుమార్ తీసుకెళ్లి తిరిగి సాయంత్రం వచ్చాడు. అయితే ఇద్దరు పూటుగా మద్యం సేవించి ఉండటం... తన వాహనం ఎందుకు తీసుకెళ్లావంటూ కవిరాజు మోజెస్‌కుమార్‌ను నిలదీయడంతో వివాదం జరిగింది. మోజెస్ తండ్రి కవిరాజును తోసేయడంతో కింద పడ్డాడు. అక్కడే ఉన్న మంచం కోడు తీసుకుని మోజెస్‌కుమార్ తలపై బలంగా కొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. పాతగుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబుకు తొత్తుగా మారిన ఎల్లో మీడియా

ఎమ్మెల్యే అభ్యర్థి చిన హనిమిరెడ్డి



అద్దంకి: చంద్రబాబుకు తొత్తుగా ఎల్లో మీడియా మారిందని అద్దంకి ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అవాస్తవాలు ప్రచారం చేస్తే ప్రజలు నమ్మరని తెలిపారు. బల్లికురవ మండలంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన తనతో పాటు బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌ను ప్రజలు నిలదీశారంటూ ఏబీఎన్ చానల్ తప్పుడు వార్తను ప్రసారం చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అవాస్తవ ప్రసారాలపై ఆయన సోమవారం ఒక వీడియోను రిలీజ్ చేశారు. అక్కడ రెండు చర్చిల పాస్టర్ల మధ్య చిన్న వివాదాన్ని ఎంపీ సర్ది చెబితే దాన్ని మార్చి తమను నిలదీశారంటూ వార్తను ప్రసారం చేయడం సరికాదని తెలిపారు. ఏబీఎన్ చానల్ చంద్రబాబు నాయుడుకకు తొత్తుగా మారిందని విమర్శించారు. నిజానికి దగ్గరగా ఉండే వార్తలు ప్రచురిస్తే చానల్‌కు మంచి పేరు వస్తుందని సలహా ఇచ్చారు. ఇకనైనా అవాస్తవాలను ప్రచారం చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెప్తారని హితవు పలికారు.

అత్యద్భుతం 'ఈస్టర్ కంటాట' నాటిక

వేల సంఖలో హాజరై తిలకించిన విశ్వాసులు


ఏసుక్రీస్తుకు శిలువ వేసిన సన్నివేశం


ప్రభువైన ఏసుక్రీస్తు సముద్రంలో నడుస్తున్న దృశ్యం

చీరాల రూరల్: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని 'ఈస్టర్ కంటాట' అను ఆధ్యాత్మిక నాటికను ఎంతో అద్భుతంగా ప్రదర్శించారు. స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో గ్లోబల్ క్రిస్టియన్ ఎంపవర్‌మెంట్ అసోసియేషన్ సహకారంతో చర్చి మైదానంలో సువార్త వేదికపై ఆదివారం రాత్రి నాటికను ప్రదర్శించారు. ప్రభువైన ఏసుక్రీస్తు సిలువపై మరణం, పునరుత్థాన వంటి దృశ్యాలను 80 మంది ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కళాకారులు కళ్లకు కట్టినట్టు విద్యుద్దీపాల వెలుగులలో ప్రదర్శించారు. ప్రభువైన యేసుక్రీస్తు పడిన శ్రమలను వీక్షించిన వేల సంఖ్యలో క్రైస్తవ విశ్వాసుల కళ్లు చెమర్చాయి. నాటికకు ముందుగా అంతర్జాతీయ ప్రసంగీకులు ఐజక్ కిమ్ దేవుని వాక్య సందేశాలు అందజేశారు. ముందుగా నూతనంగా నిర్మించిన సువార్త వేదికను ఏఈఎల్‌సీ తూర్పు గుంటూరు సినడ్ బిషప్ రైట్ రెవరెండ్ కూరాకుల రత్నమోహన్, ఏఈఎల్‌సీ సెక్రటరి చిన్నం కిశోర్ బాబు, చర్చి పాస్టర్లు రెవరెండ్ కొమ్మిన జోసఫ్ కేరి, రెవరెండ్ పిల్లి దేవదాసు, ఐజక్ కిమ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్, ట్రెజరర్ పేర్లి ఆనంద్, పీసీసీ, ఎల్‌సీసీ, సంఘస్థులతో పాటు చీరాల, పరిసర ప్రాంతాలకు చెందిన క్రైస్తవ విశ్వాసులు వేఖ సంఖ్యలో హాజరయ్యారు. చర్చి రోడ్లు కార్లు, దిచక్రవాహనాలు, ఆటోలతో నిండిపోయింది.

ఎల్లో మీడియాపై భగ్గుమన్న మహిళలు


రాధాకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మహిళలు

బల్లికురవ: ఎల్లో మీడియా తప్పుడు వార్తలు, ప్రసారాలతో తమ మనోభావాలను దెబ్బతీస్తోందని బల్లికురవ మండలంలోని ఎస్సీ కాలనీ మహిళలు సోమవారం సాయంత్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నందిగం సురేష్, అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి ప్రచారం ముగింపులో స్థానిక చర్చిలో ప్రార్థనలో పాల్గొన్నారన్నారు. ఎంపీ సురేష్ వెంట గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతిపరులు ఉండటంతో 'మీరు ఎందుకు వచ్చారు.. మా ప్రోగ్రాం' అని బయటకు పొమ్మని చెప్పామన్నారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సురేష్‌నే బయటకు పొమ్మాన్నరంటూ అసత్య ప్రచారాలు చేసిందని, ఎల్లో మీడియా తీరు మార్చుకోవాలని తెలిపారు. ప్రతి విషయాన్ని మసిపూసి మారేడు కాయ చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు, దత్తపుత్రడు పవన్‌కళ్యాణ్, మోసపూరిత మాటలను నమ్మే పరిస్థితుల్లో లేమని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో జగనన్న రెండోసారి సీఎంగా బాధ్యతలు చేపడతారని ముక్తకంఠంతో ప్రకటించారు. ఎంపీగా నందిగం సురేష్‌కు, అద్దంకి ఎమ్మెల్యేగా హనిమిరెడ్డి గెలుపునకు శక్తివంచన లేకుండా పనిచేస్తామని ప్రకటించారు. నిరసనలో భాగంగా ఎస్సీ కాలనీలో ఏబీఎన్, ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేశారు.

నూర్పిడి మిషన్‌పై నుంచి పడి మహిళ మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- పరామర్శించిన ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్


ప్రమాద స్థలంలో బుజ్జమ్మ మృతదేహం


బాధితురాలిని పరామర్శిస్తున్న కరణం వెంకటేష్


ప్రమాదానికి కారణమైన నూర్పిడి మిషన్

వేటపాలెం: ట్రాక్టర్ వెనక ఉన్న నూర్పిడి మిషన్ డోర్ ఊడి పోవడంతో దానిపై కూర్చుని ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జాతీయ రహదారి 216 అక్కాయిపాలెం పంచాయతీ లక్ష్మీపురం వద్ద బైపాస్ రోడ్డులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అక్కాయిపాలేనికి చెందిన ట్రాక్టర్ నూర్పిడి మిషన్‌తో పాటు కూలీలను ఎక్కించుకొని పాపాయిపాలెం గ్రామానికి వెళ్తోంది. పైన కొంతమంది కూర్చొని ఉండగా, మరో నలుగురు మహిళలు వెనక పైపున్న నూర్పిడి మిషన్‌పై కూర్చున్నారు. బైపాస్ రోడ్డుపై వెళుతుండగా, నూర్పిడి మిషన్‌కి సైడు భాగంలో ఉన్న ఇనుప డోర్ అకస్మాత్తుగా ఊడిపోయింది. దీంతో డోర్ పైభాగంలో కూర్చొన్న మహిళా కూలీలు రోడ్డుపై పడిపోయారు. అందులో నక్కల బుజ్జమ్మ (55) అక్కడిక్కడే మృతి చెందింది. మరో ముగ్గురి మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. 108వాహనంలో బాధితుల్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ జీ సురేష్ పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. బుజ్జమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలిం చారు. ప్రమాదం విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ చీరాల అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంక టేష్‌లు చీరాల ఏరియా వైద్యశాల్లో చికిత్స పొందున్న మహిళలను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మృతి చెందిన నక్కల బుజ్జమ్మ మృత దేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. వారి కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

సమాజానికి టెక్నాలజీ ఎంతో అవసరం


ఎంసెట్రిక్స్ పత్రికను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ పి.సిద్దయ్య, ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: రాబోయే కాలంలో సమాజానికి టెక్నాలజీ ఎంతో అవసరం అని డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సిద్దయ్య తెలిపారు. జేఎన్‌టీయూఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంసెంట్రిక్స్ టెక్ ఫెస్ట్‌ను సోమవారం నిర్వహించారు. ఫెస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ పి.సిద్దయ్య, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎస్ కిశోర్‌బాబులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రొఫెసర్ పి.సిద్దయ్య మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీని తెలుసుకునేందుకు, విద్యార్థుల్లో ప్రతిభను పెంపొందించేందుకు టెక్నికల్ ఫెస్ట్‌లు దోహదపడతాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన కళాశాలలో విద్యార్థులకు అవసరమైన ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వీటిని విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఏ.గంగాధర మాట్లాడుతూ టెక్‌ఫెస్ట్‌లో వీఎల్ఎస్ఐ వర్క్‌షాప్‌నకు విశేష స్పందన లభించదని తెలిపారు. దాదాపు 310 మంది విద్యార్థులు వివిధ ఈవెంట్స్‌లో రిజిస్ట్రేషన్ అయ్యారని వివరించారు. ఫెస్ట్ సమన్వయకర్తలు ఎస్‌వీ సాయిప్రసాద్, వై.నవీన్‌కుమార్, విద్యార్థి సమన్వయకర్తలు భార్గవి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.